క్లుప్తంగా

17న జాతీయ బీసీ సంక్షేమ సంఘ మహాసభ



జాతీయ బీసీ మహాసభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నమ్మి అప్పలరాజు తదితరులు

గోపాలపట్నం: జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహాసభ ఈ నెల 17న విజయవాడ వేదికగా నిర్వహించనున్నట్టు ఆ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నమ్మి అప్పలరాజు తెలిపారు. ఈ మేరకు ఎన్‌ఏడీలోని కార్యాలయం వద్ద ఆదివారం మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. దేశంలోని బీసీలను రాజకీయ పార్టీలు ఓటు బ్యాంక్‌గా వాడుకుని వదిలేస్తున్నాయని ఆరోపించారు. రాజ్యాధికారం వచ్చే వరకు మా పోరాటం ఆగదని అన్నారు. మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు సబ్ కోటా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని కోరారు. విద్య, ఉద్యోగాలతోపాటు చట్ట సభల్లో స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రోమాల శ్రీనివాస రావు, మహిళా అధ్యక్షురాలు సానబోయిన శ్రీదేవి, నాయకులు ఉప్పిలి అప్పారావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగాపై ప్రజల్లో అవగాహన కల్పించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న టీఎస్‌వీ ప్రసాద్

గోపాలపట్నం: భారతీయ సంస్కృతిలో భాగమైన యోగా విశిష్టతపై ప్రజలకు అవగాహన కల్పించాలని పతంజలి యోగా సమితి రాష్ట్ర వైస్‌ప్రెసిడెంట్ టీవీఎస్ ప్రసాద్ అన్నారు. సీతారామరాజునగర్ పార్క్‌లోని సీతారామరాజు సాంస్కృతిక కళాక్షేత్రంలో ఆదివారం గురుపౌర్ణమి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యోగా గురువులను ఘనంగా సత్కరించారు. కిసాన్ సేవా సంమితి ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ యోగాను ప్రజలు తమ జీవన విధానంలో భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. త్వరలో అసిస్టెంట్ యోగా టీచర్ ట్రైనింగ్ -3 కార్యక్రమం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సోమేశ్వరరావు, గణపతిరావు, ప్రభాకర్, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి మందలించిందని ఆత్మహత్య

మల్కాపురం: తల్లి మందలించిందని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించి మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివి. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం సమీపంలోని ఆర్‌కేపురం వద్ద తమ్మిన వరుణ్ కుమార్ (45) తన తల్లితో కలిసి నివాసం ఉంటున్నాడు. వరుణ్‌కు భవాని అనే మహిళతో 24 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. అయితే భార్యాభర్తల మధ్య కలహాలు ఏర్పడటంతో వీరిద్దరూ 18 ఏళ్లుగా దూరంగా ఉంటున్నారు. వరుణ్ తల్లితోనే కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో వరుణ్ మద్యానికి బానిసయ్యాడు. వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్ అయిన వరుణ్.. తను పని చేసి తెచ్చుకున్న డబ్బులతో మద్యం సేవించి ఇంట్లో ఇబ్బందికర పరిస్థితులు సృష్టిస్తున్నాడు. ఇదిలా ఉండగా, శనివారం రాత్రి కూడా పూటుగా మద్యం సేవించిన వరుణ్ ఇంటికి వచ్చి తల్లితో వాదించాడు. దీంతో ఆమె కుమారుడిని మందలించింది. అతని చేష్టలతో విసుగు చెందిన ఆమె తన పెద్ద కుమారుడి వద్దకు వెళ్లిపోయింది. 'తల్లి లేదు, భార్య లేదు, పిల్లలు లేరు'అని మనస్తాపానికి గురైన వరుణ్ తన గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం ఘటనా స్థలానికి చేరుకుని, వరుణ్ ఆత్మహత్యపై వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న పురాతన కెమెరాల ప్రదర్శన

ఏయూక్యాంపస్: జాతీయ కెమెరా దినోత్సవం సందర్భంగా ఆదివారం వీఎంఆర్డీఏ పార్క్ ఆవరణలో ప్రదర్శించిన పురాతన కెమెరాలు ఆకట్టుకున్నాయి. వాల్తేరు ఫొటోగ్రఫీ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వందకు పైగా విభిన్న రకాల కెమెరాలను ప్రదర్శించారు. 1940 నుంచి నేటి వరకు ఉపయోగించిన కెమెరాలను ప్రదర్శనలో ఉంచి, వాటి ప్రత్యేకతలను సందర్శకులకు సొసైటీ ప్రతినిధులు వివరించారు. సందర్శకులు వాటితో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

రోడ్లా.. చెరువులా..

- పూడికల తొలగించకపోవడంతో రోడ్డెక్కుతున్న మురుగు, వరదనీరు
- రాకపోకలకు అవస్థలు
- పట్టించుకోని పాలకులు

చిన్నపాటి వర్షం పడినా పారిశ్రామిక ప్రాంత వాసులు వణుకుతున్నారు. కొండవాలు ప్రాంత ప్రజలైతే బితుకుబితుకు మంటూ గడుపుతున్నారు. మరో వైపు వ్యర్థాల నిర్వహణ లేక ఏమాత్రం వర్షం కురిసినా గెడ్డలు పొంగి మురుగు రోడ్డెక్కుతోంది. కొన్ని ప్రాంతాల్లో సేవా మార్గాలు చెరువులను తలపించే విధంగా మారుతున్నాయి.అయినా సమస్య పరిష్కారంపై పాలకులు దృష్టిసారించడం లేదు. – మల్కాపురం



మురుగు నీటిలో అవస్థలు పడుతూ ప్రయాణం సాగిస్తున్న వాహనదారులు



శ్రావణి షిప్పింగ్‌కు వెళ్లే మార్గంలో గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

జీవీఎంసీ 58వ వార్డు ములగాడ విలేజ్ నుంచి శ్రావణి షిప్పింగ్‌కు వెళ్లే మార్గం పూర్తిగా గుంతల మయం అయింది. ఈరోడ్డులో ప్రయాణం సాగించలేక ఇబ్బంది పడుతున్న వాహనదారులకు వర్షం పడితే నరకమే కనిపిస్తుంది.గుంతల్లో నీరు నిలిచిపోవడంతో గోతులను గుర్తించ లేక వాహనదారులు ప్రమాదాలకు గురికావడం సర్వసాధారణం అయింది. ఆదివారం మధ్యాహ్నం ఉరుములతో కురిసిన భారీ వర్షానికి ఈ మార్గం పూర్తిగా నీటితో మునిగిపోయింది. ఆ సమయంలో రాకపోకలు సాగించిన వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.శిథిలావస్థలో ఉన్న ఈ మార్గానికి మరమ్మతులు చేపట్టి మోక్షం కలిగిస్తామని ప్రభుత్వ విప్ గణబాబు హామీ ఇచ్చి ఏడాది కావస్తున్నా ఇంత వరకు అమలు కాలేదు.

గెడ్డ ఆధునీకీకరించినా..

జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మరిడిమాంబ ఆలయానికి సమీపాన గెడ్డ ఉంది. ఐదేళ్ల కిందట సుమారు రూ. 20 కోట్ల వ్యయంతో గెడ్డను ఆధునికీకరించారు. దీంతో ఇక్కడ మురుగు సమస్య ఉండదని ప్రజలు సంతోషించారు. అయితే గెడ్డలో వ్యర్థాలను సకాలంలో తొలగించకపోవడంతో భారీ వర్షానికి ఎగువ ప్రాంతం నుంచి వచ్చే నీరు ఇక్కడ పోయే మార్గం లేక రోడ్డుపైకి వస్తోంది. ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి ఇదే సమస్య ఎదురైంది. దీంతో కల్యాణమండపంలో నీరు చేరడంతో శుభకార్యానికి వచ్చిన ఆహుతులు చాలా అసౌకర్యానికి గురయ్యారు. కోట్ల రూపాయలతో కట్టిన గెడ్డ పరిస్థితి మరలా పూర్వ పరిస్థితికి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.అధికారులు, పాలకులు స్పందించి రోడ్లు మరమ్మతులు చేపట్టడంతో పాటు కాలువలు, గెడ్డల్లో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించి ముంపు కష్టాల నుంచి గట్టెక్కించాలని ప్రజలు కోరుతున్నారు.



మల్కాపురం మరిడిమాంబ ఆలయం వద్ద రోడ్డుపైకి వచ్చిన మురుగు



ట్రాఫిక్‌లో ఇరుక్కున్న వాహనదారులు

పైడిమాంబ ఆలయంలో భారీ అన్నసమారాధన



అన్నసమారాధన చేస్తున్న కమిటీ సభ్యులు

కంచరపాలెం: స్థానిక ఐటీఐ జంక్షన్‌లోని సుంకురపేట ప్రజల ఆరాధ్యదైవం పైడిమాంబ అమ్మవారి వేడుకల్లో భాగంగా ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పులఖండం శ్రీనివాసశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు పిల్లి చంద్రశేఖర్, పిల్లి నాగమణి, సీతారామ్, శోభారాణి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక అలంకరించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో నిర్వహించిన భారీ అన్న సమారాధనను స్థానిక నాయకులు, ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు ప్రారంభించారు. సుమారు 5వేల మంది అన్నప్రసాదాలు స్వీకరించినట్టు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు.

జయేంద్రకాలనీలో అంధకారం



63వ వార్డు జయేంద్రకాలనీలో వెలగని వీధిలైటు ఉన్న స్తంభం

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి జయేంద్ర కాలనీలో వీధిలైట్లు వెలగకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. చీకటి పడితే విషకీటకాల సంచారం అధికంగా ఉంటుందని, దీంతో వీధుల్లో ప్రయాణించాలంటే భయమేస్తోందని ఆవేదన చెందుతున్నారు. వీధి కుక్కలు పడుకుంటున్నాయని, చీకట్లో తెలియక వాటిని తొక్కుతుండడంతో ప్రజల మీద పడి గాయపరుస్తున్నాయని చెబుతున్నారు. పలుమార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని, అధికారులు త్వరితగతిన స్పందించి వీధి లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

స్మార్ట్ మీటర్లను ప్రజలు తిరస్కరించాలి



స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలని కోరుతూ పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

సింధియా: అదానీ ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఇళ్లకు బిగించకుండా ప్రజలు తిరస్కరించాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 63వ వార్డు కాకరలోవ, చింతల్లోవ, జయేంద్రకాలనీ తదితర ప్రాంతాల్లో పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని, స్మార్ట్ విద్యుత్ మీటర్లు బిగించాలనే ఆలోచనను ప్రభుత్వం మానుకోవాలని కోరుతూ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న విద్యుత్ మీటర్ల రీడింగును సిబ్బందితో తీయిస్తూ ప్రక్రియ ఆటంకాలు లేకుండా సాగుతుందని, కానీ ప్రభుత్వం అదానీ ప్రయోజనాలకు అనుగుణంగా బాగా పనిచేస్తున్న మీటర్లు తొలగిస్తుందని ఆరోపించారు. ఇప్పటికే అదానీ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు పరిశ్రమలకు, వాణిజ్య సముదాయాలకు బిగించారని, తాజాగా అపార్టమెంట్‌లకు కూడా బిగించాలని చూస్తున్నారని, ఇది చాలా అన్యాయమని అన్నారు. విద్యుత్ రంగం మొత్తం ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నాడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాయని, మంత్రి నారా లోకేష్ అదానీ స్మార్ట్ మీటర్లను బద్దలు కొట్టమని ప్రజలకు పిలుపునిచ్చారని, తీరా అధికారంలోకి వచ్చాక స్మార్ట్‌మీటర్లను ప్రోత్సహించడం సమంజసం కాదన్నారు. వెంటనే పెంచిన విద్యుత్ చార్జీలను తగించి, స్మార్ట్ మీటర్లు వెనక్కి తీసుకోవాలని, లేదంటే కూటమి ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జోన్ నాయకులు పెంటారావు, ఎన్.శ్రీనివాసరావు, ఎస్. వాసు, నరేష్, పిసిని రామారావు, ఆదినారాయణ, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి ఆశ్రయం



వృద్ధురాలిని మదర్ థెరిసా ఆశ్రమంలో చేర్పించిన మమత

గోపాలపట్నం: ఎన్‌ఏడీ జంక్షన్ బ్రిడ్జి దిగువన ఉన్న గుర్తు తెలియని వృద్ధురాలిని మమత చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ ఎల్లేటి మమత ఆదుకుని మానవత్వం చాటుకుంది. వృద్ధురాలు తీవ్రమైన జ్వరంతో బాధపడుతోంది. అది గమనించి ఎయిర్‌పోర్టు పోలీసుల సహకారంతో ట్రస్ట్ వాహనంలో మదర్ థెరిసా ఆశ్రమానికి తరలించారు. అక్కడ వృద్ధురాలికి వైద్యంతో ఆశ్రయం కల్పిస్తారని ఆమె పేర్కొన్నారు.

మోసాలకు బ్రాండ్ అంబాసిడర్ 'బాబు'



సమావేశంలో మాట్లాడుతున్న మళ్ల విజయప్రసాద్



కార్యక్రమంలో పాల్గొన్న కార్యకర్తలు,నాయకులు

- రెడ్‌బుక్ అమలే.. సంక్షేమం ఎక్కడ?
- నిలదీస్తా అన్న పవన్ మౌనం ఎందుకో..
- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్
- ఉత్సాహంగా బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం

మల్కాపురం: నమ్ముకున్న వారిని మోసగించడంలో చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సంక్షేమాన్ని మరిచి... రెడ్‌బుక్ పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెంలో ఆదివారం పార్టీ వార్డు అధ్యక్షుడు గులిగిండల కృష్ణ అధ్యక్షతన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మళ్ల విజయప్రసాద్ మాట్లాడుతూ గడిచిన ఎన్నికల్లో చంద్రబాబు,పవన్‌కల్యాణ్,,లోకేష్‌లు సూపర్ సిక్స్ పేరిట ప్రజలను నమ్మించారని.. తీరా అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయినా హామీలు పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. పైగా సూపర్‌సిక్స్ హామీలు అన్నీ అమలు చేశామని,ఇంకా చేయడానికి ఏమీ లేదని ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటు అన్నారు. తల్లికి వందనంలో కోతలు పెట్టి అనేకమందిని పథకానికి దూరం చేశారన్నారు. ఉచిత గ్యాస్ డబ్బులు ఇప్పటికీ కొంత మందికి రావడం లేదని.. వారంతా తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని స్థితిలో ఉన్నారన్నారు. నిరుద్యోగ భృతి, లక్ష ఉద్యోగాలు ఎక్కడ అని ప్రశ్నించారు. ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతుంటే.. తొలి అడుగు పేరిట కూటమి సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.

కక్షపూరిత రాజకీయాలకే పరిమితం

రాష్ట్రంలో హత్యా రాజకీయాలు జరుగుతున్నాయని.. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు వంటిదన్నారు. ప్రశ్నించే వారి గొంతునొక్కుతున్న చంద్రబాబుకు ప్రజలే తగిన సమయంలో బుద్ధి చెబుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మహిళలకు రాష్ట్రంలో రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు అన్యాయం జరిగితే ప్రశ్నిస్తానని ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన పవన్ కల్యాణ్.. మహిళలు, దళితులకు అన్యాయం జరుగుతున్నా ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని, ప్రజలు నిలదీసే రోజులు అతి దగ్గరలో ఉన్నాయన్నారు. ప్రజల తరపున తాము గళం విప్పుతామని.. ఎప్పటికప్పుడు ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. ప్రతికార్యకర్త రెట్టించిన ఉత్సాహంతో పని చేసి ప్రజలకు చేరువకావాలని పిలుపునిచ్చారు. కూటమి ఇచ్చిన హామీలు.. అధికారంలోకి వచ్చిన తర్వాత చేస్తున్న మోసాన్ని ప్రతిఇంటికీ వివరించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య, రాష్ట్ర గ్రీవెన్స్‌సెల్ కార్యదర్శి గొందేశి సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి చుక్క వరలక్ష్మి, వైఎస్సార్‌టీయూ ప్రధాన కార్యదర్శి పిలకా రమణరెడ్డి, ఎస్సీసెల్ విభాగం సభ్యుడు బొంతు సాల్మన్‌రాజు, సీనియర్ నాయకులు ఎదురు రాజు, అప్పన్న, అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

నాడు కళకళ.. నేడు కళా విహీనం

- నేతాజీ వంతెన మార్గం దుస్థితి..
- మొక్కల నిర్వహణ గాలికి.
- శిథిలావస్థలో రక్షణగోడలు, పుట్‌పాత్‌లు..



ఎండిపోయిన మొక్కలు



విరిగిన స్తంభాన్ని వదిలేశారిలా...



అధ్వానంగా నేతాజీ వంతెన ఫుట్‌పాత్, రోడ్డు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం–జ్ఞానాపురం మార్గంలోని నేతాజీ ఫ్లైఓవర్‌పై పచ్చదనం కనుమరుగవుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వంతెనను సుందరంగా తీర్చిదిద్దారు. ఫుట్‌పాత్‌లపై టైల్స్, రక్షణగోడలకు రంగులు, విద్యుత్ లైట్లు, పచ్చదనం కోసం కుండీల్లో మొక్కలు నాటారు. దీంతో నేతాజీ వంతెన కళకళలాడేది. ఎంతో ఆహ్లాదకరంగా ఉండేది.

నేడు దారుణం

ఈ వంతెనకు కూతవేటు దూరంలో జోన్–5 జోనల్ కార్యాలయం ఉంది. నిత్యం అటుగా జోనల్ అధికారులు, సిబ్బంది ప్రయాణం సాగిస్తారు. అయినా ఎండిపోతున్న మొక్కలు కనిపించకపోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు మండిపడుతున్నారు. నేడు రక్షణగోడ, ఫుట్‌పాత్‌లు, వంతెన రహదారులు శిథిలావస్థలకు చేరి పూర్తిగా కళావిహీనంగా మారాయి. కంచరపాలెం నుంచి జ్ఞానాపురం రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు, పాదచారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మొక్కలకు సక్రమంగా నీరు అందించకపోవడంతో ఎండిపోయాయి. పచ్చదనంపై జీవీఎంసీ హారికల్చర్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పచ్చదనం ఇలా కనుమరుగైందని పలువురు పాదచారులు, వాకర్స్, ద్విచక్ర వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మళ్లీ మొక్కలు చిగురిస్తున్నాయి. విద్యుత్ స్తంభాల నిర్వహణ అంతంత మాత్రమే ఉండడంతో రాత్రి సమయంలో చీకటి రాజ్యమేలుతోంది. గత నెలలో కురిసిన గాలులు, వర్షానికి వంతెనపై విరిగిన విద్యుత్ స్తంభాలు మూలకు చేరాయి. నేటికీ వాటి స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పర్యవేక్షించి కనుమరుగవుతున్న పచ్చదనానికి మోక్షం, రక్షణగోడలకు రక్షణ, ఫుట్‌పాత్‌లపై పలకలు, విద్యుత్ స్తంభాల సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



ఫుట్‌పాత్‌లపై ప్రమాదభరితంగా కేబుల్‌వైర్లు



నేతాజీ వంతెనపై స్తంభం తొలగించకపోవడంతో పాదచారులకు అవస్థలు

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారికి ఆదివారం ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, ట్రస్టు సభ్యులు సేవలందించారు.